# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-08-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. దేశ భక్తిని, ఐక్యతా భావనను పాదుకోల్పజేసే "హర్ ఘర్ తిరంగ" కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు పిలుపు నిచ్చారు.
2. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తోంది.
3. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రమాణాలతో వేగంగా ముందుకు తీసుకువెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.
4. ఆంధ్రప్రదేశ్‌లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని కేంద్ర ఉక్కు ..., భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రకటించారు.
5. రాష్ట్రంలో చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు.

===========================

ఐక్యతా భావన ..., దేశ భక్తిని పాదుకొల్పజేసేందుకు ఉద్దేశించిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు నిర్వహించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు పిలుపు నిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి .... సంబంధిత సెల్ఫీలను అప్ లోడ్ చేయాలని ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత రెండేళ్లుగా చేస్తున్న హర్ ఘర్ తీరంగా ప్రచారం జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకున్నదని, ప్రతి భారతీయునిలో ఐక్యతా భావనను పాదుకోల్ప జేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అన్నారు. దేశ భక్తి ప్రధానాంశంగా నిర్వహిస్తున్న ఈ ఉద్యమాన్ని గతంలో మాదిరిగానే అదే ఉత్సాహంతో నిర్వహించాలని, పతాకాన్ని ఎగురవేసిన సెల్ఫీలను హర్ ఘర్ తిరంగా వెబ్ సైట్‌లో పొందుపరచాలని అమిత్ షా ఎక్స్ లో పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రేపు జిల్లాల కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నది. వెలగపూడి సచివాలయంలో జరిగే ఈ సదస్సులో మంత్రులు, ఆయా శాఖల ప్రత్యేక, ముఖ్య కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లు... పాల్గొంటారు. రేపు ఉదయం పది గంటలకు

ప్రారంభమయ్యే ఈ సదస్సులో తొలుత ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, ఆ తరువాత ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తారు. శాఖల వారీ పని తీరు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ముఖ్య మంత్రి ఈ సందర్భంగా సమీక్షిస్తారు. ఒక రోజు జరిగే ఈ సదస్సులో విజన్ ఆంధ్ర–2047 దార్శనిక పత్రంపై ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు.

---------------------------

రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమానికి నిధులు ఖర్చు చేసిన అంశంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ రక్షిత నీటి సరఫరా–ఆర్‌డబ్ల్యుస్ .... అధికారులతో గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..... ఈ పథకం కోసం ఇప్పటివరకు ఖర్చు చేసిన నాలుగు వేల కోట్ల రూపాయలతో చేపట్టిన పనులను ప్రతి దశలోనూ సమగ్రంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ పనులను ప్రమాణాలకు అనుగుణంగా మరింత ముందుకు తీసుకు వెళ్లాలని ...., ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పనుల పురోగతి కనిపించాలని కూడా అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కేంద్ర ఉక్కు ..., భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఈ రోజు దర్శించుకున్న అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేందుకు వీలుగా కొత్త పరిశ్రమలను తీసుకువస్తామని ప్రకటించారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ప్రపంచంలో మూడవ స్థానానికి చేరుతుందని భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

---------------------------

దేశంలో దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలో నిన్న జరిగిన వికలాంగుల ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ....దివ్యాంగులకు ఎప్పుడు ఎటువంటి సహాయం కావలసి వచ్చినా తాను ముందుంటానని హామీ ఇచ్చారు.

---------------------------

చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. మగ్గాలపై నేసిన చేనేత చీరలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో విశాఖపట్నంలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.... చేనేత కళాకారులను ఆదరించి, అందరూ వారు నేసిన వస్త్రాలను వినియోగించాలని సూచించారు. భావితరాల వారు సంప్రదాయ వస్త్ర ధారణను కొనసాగించాలన్నా, చేనేత కళాకారులు పది కాలాల పాటు తమ ఉత్పత్తులను అందించాలన్నా.... చేనేత వస్త్రాలను ఆదరించడం తప్పనిసరి అని వంగలపూడి అనిత అన్నారు.

---------------------------

శిశువుకు తల్లిపాలు ఇవ్వవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల ఒకటవ తేదీ నుండి

జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు ఈరోజు నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ..., ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో తల్లిపాల శ్రేష్టతను తెలియజేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, ఈ పాలలో విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు వుంటాయని ఆయా కార్యక్రమాలలో వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

కాగా .... శ్రీకాళహస్తి నియోజకవర్గం కమ్మ కొత్తూరు గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో ఈరోజు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లి పాల అవగాహనా కార్యక్రమం జరిగింది.

---------------------------

కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరద నీటి చేరిక కొనసాగుతోంది. దీంతో .... ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పది గేట్లను అధికారులు ఇరవై అడుగుల మేర ఎత్తి దిగువన నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 4 లక్షల 50 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతుండగా ....., దిగువకు 5 లక్షల 22 వేల 318 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయీ నీటి మట్టం 885 అడుగులు కాగా .... ప్రస్తుత నీటి మట్టం 883 అడుగుల వద్ద ఉంది. మరొక వైపు .... శ్రీశైలం జలాశయం నుండి భారీగా నీరు వస్తుండడంతో ఈ ప్రాజెక్టు గేట్లను ఈ రోజు తెరిచే అవకాశం ఉంది.

---------------------------

రాష్ట్రంలో ఇళ్ళు లేని పేదలకు అర్హత ప్రకారం ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... ఒక లక్ష్యం నిర్దేశించుకుని టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. ఈఎంఐ పద్ధతిలో లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కొలుసు పార్థ సారథి తెలుపుతూ..

..వాయిస్..36 సెకన్లు

---------------------------

విశాఖ పట్నం రైల్వే స్టేషన్‌లో ఆగి వున్న రైలులో ఈరోజు అగ్నిప్రమాదం సంభవించింది. కోర్బా నుండి విశాఖపట్నం చేరుకున్న ఈ రైలులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మూడు ఎ.సి. బోగీలలో మంటలు వ్యాప్తి చెందాయి. తక్షణమే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటన జరిగిన సమయంలో రైలులో ప్రయాణీకులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించిందని రైల్వే పోలీసులు తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే అక్టోబర్ నాలుగవ తేదీ నుండి జరుగుతాయి. అక్టోబర్ 4న ధ్వజారోహణం, 8న గరుడ సేవ, 9న స్వర్ణ రథం, 11న రథోత్సవం, 12న చక్ర స్నానం నిర్వహిస్తారు. శ్రీ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు నిన్న తిరుమలలో సమావేశమై చర్చించారు.

---------------------------

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలను సాధించిన భారత యువ షూటర్ మను బాకర్ మూడవ పతకాన్ని తృటిలో చేజార్చుకున్నారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఆమె ఈ అవకాశాన్ని కోల్పోయారు. మనుబాకర్ తొలుత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించగా ...., మరొక షూటర్ సరబ్ జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల పిస్టల్ మిక్సెడ్ డబుల్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు.

======================